సాక్షి సంగారెడ్డి

బుధవారం । 3 । జూలై । 2024



రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు.

వివరాలు 8లో ▸



ఆకతాయిల ఆగడాలకు..

ఎస్పీ రూపేష్ మంగళవారం కలెక్టరేట్ ఎదుట రూ. 3 లక్షల విలువైన సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించారు. వివరాలు 8లో ▸



సమష్టి కృషితోనే అభివృద్ధి

సమష్టి కృషితోనే అభివృద్ధి చేసినట్లు ఎంపీపీ, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. వివరాలు 9లో ▸

పరిహారంపై కసరత్తు

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారంపై రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి ఎంత ధర చెల్లించాలనే దానిపై దృష్టి సారించారు. కొద్ది రోజుల్లోనే భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామాల వారీగా ఈ సమావేశాలు జరపాలని భావిస్తున్నారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

నిర్వాసితులతో సంప్రదింపులకు సన్నాహాలు

- జిల్లా పరిధిలో 712 ఎకరాల భూ సేకరణ
- గ్రామాల వారీగా సమావేశాలు
- రీజినల్ రింగ్‌రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు

ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇందు కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్వాసిత రైతులకు ఇచ్చే పరిహారం రేటును తేల్చాలని ఆర్డీఓలను ఆదేశించినట్లు సమాచారం.



19 గ్రామాలు.. 712 ఎకరాలు

రింగ్‌రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి సంగారెడ్డి జిల్లా పరిధిలో కొండాపూర్ మండలం పెద్దాపూర్ నుంచి హత్నూర మండలం వరకు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఉంది. ఈ రెండు మండలాలతో పాటు, చౌటకూర్, సంగారెడ్డి మండలాల మీదుగా ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. మొత్తం 19 గ్రామాల పరిధిలో 712 ఎకరాల భూమి అవసరమని తేల్చారు. ఈ మేరకు పలు రకాల సర్వేలు చేశారు. ఇటీవలె ఎంజాయ్‌మెంట్ సర్వే కూడా పూర్తయింది. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌పై సంబంధిత వ్యక్తుల నుంచి అభ్యంతరాలను కూడా స్వీకరించారు. ఈ క్రమంలో అధికారులు రేటు తేల్చక ముందే రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. పాసుపుస్తకాల జిరాక్సులు మాత్రమే తీసుకుంటున్నామని రెవెన్యూ అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో భూములకు ఇచ్చే పరిహారంను తేల్చేందుకు ఆయా గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నిర్వాసితులతో సంప్రదింపులు జరపనున్నారు.

ఆగస్టు నెలాఖరులోపు..

భూసేకరణ ప్రక్రియను ఆగస్టు నెలాఖరులోపు కొలిక్కి తేవాలని రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయి.. పరిహారం చెల్లింపు జరిగితేనే రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టే వీలుంటుంది. లేనిపక్షంలో ఈ పనులు ప్రారంభిస్తే అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి స్థాయిలో కొలిక్కి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జోగిపేట(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు త్వరితగతిన యూనిఫాంలు కుట్టి అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం జోగిపేటలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాం తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. జోగిపేట మెప్మా ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది విద్యార్థులకు యూనిఫాంలు తయారు చేసేందుకు పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈనెల 10వ తేదీలోపు వీటిని పాఠశాలలకు అందజేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటవుతున్న వెంచర్లు, నాలా కనెక్షన్, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, తహసీల్దారు భాస్కర్, కమిషనర్ తిరుపతి, మెప్మా కోఆర్డినేటర్ బిక్షపతి, ఇరిగేషన్ ఏఈ మజర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు ఉన్నారు.



ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

జహీరాబాద్ టౌన్: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ దేవి దేవత మూర్తులను పార్లమెంట్ సాక్షిగా రాహుల్ గాంధీ అవమానించారంటూ మంగళవారం పట్టణంలో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని, ఓట్ల కోసం మైనార్టీలతో బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని అవమానించేవిధంగా ఉన్నాయన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్ పాటిల్, సుధీర్ బండారీ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, జనార్దన్‌రెడ్డి, వైద్యనాథ్ పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

4న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇంటర్వ్యూలు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాలో 11, మెదక్ జిల్లాలో 4 సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని మెదక్ వెస్ట్ రీజియన్ ప్రాంతీయ సంయుక్త అధికారి ఎం.భీమయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఈనెల 4వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హత కలిగిన వారు పూర్తి బయోడేటా, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు ఇస్నాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జడ్జి రమేష్

హత్నూర(సంగారెడ్డి): మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సీనియర్ జడ్జి రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దౌల్తాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఒకేషనల్ కాలేజీలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎన్నో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, ప్రతీ ఒక్కరు లక్ష్యాలను ఛేదించే వరకు శ్రమించాలని సూచించారు. అలాగే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం మాట్లాడుతూ.. పిల్లలకు ఎలాంటి సమస్య వచ్చినా 1098 చైల్డ్‌లైన్‌కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బోధన ప్రమాణాలు పెంపొందించండి



గురుకులాన్ని సందర్శించిన జుబేద బేగం

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జుబేద బేగం సందర్శించారు. పాఠశాల, కళాశాల క్యాంపస్‌ను పరిశీలించారు. ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. గురుకులం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. బోధన ప్రమాణాలు మెరుగుపరచుకుని, విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట కార్పొరేషన్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి, జిల్లా డీఎండబ్ల్యూ దేవుజ, కమిషన్ సభ్యులు, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్లు జే. రాములు, ఎస్కే జమీల్, సిబ్బంది సమియొద్దీన్, ఇర్ఫాన్ ఉన్నారు.

కార్యదర్శుల డిప్యుటేషన్ రద్దుచేయాలి



డీపీఓకు సమస్య వివరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పంచాయతీ కార్యదర్శుల డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ జిల్లా సభ్యులు రవీందర్ నాయక్‌లు మంగళవారం సంగారెడ్డిలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను కోరారు. పలుకుబడి ఉపయోగించుకొని డిప్యుటేషన్ వేయించుకున్నారని తెలిపారు. పనిచేసేది ఒకచోట అయితే వేతనం మరోచోట తీసుకుంటున్నారన్నారు. అలాగే పంచాయతీలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు యాదవ్, ప్రసాద్ ఉన్నారు.

కంకర క్రషర్లతో ఇబ్బందులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధి మాదారం గ్రామంలో ఉన్న కంకర క్రషర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వీటిని మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆర్డీఓ వసంత కుమారిని కోరారు. ఈ సందర్భంగా మెకు వినతి పత్రం అందించారు. లీజ్ గడువు ముగిసినా రెండు క్రషర్లను కొనసాగిస్తున్నారని తెలిపారు. స్పందించిన ఆర్డీఓ.. ఈ విషయంపై తక్షణమే విచారణ జరపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం వావిలాల, బొల్లారం గ్రామాల్లో ఆర్డీఓ పర్యటించి భూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బిక్షపతి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు విజయ్‌గౌడ్, గణేష్, అంబదాస్ పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్

నీటి సమస్యను పరిష్కరించండి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలో నీటి సమస్యను పరిష్కరించాలని మంత్రి దామోదర రాజనర్సింహను అఖిల భారత బంజార ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్(ఏబీబీఎఫ్) వినయ్ పవార్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య గురించి ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది సమయ పాలన పాటించడంలేదని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గోవింద్ రాథోడ్, విష్ణువర్ధన్ ఉన్నారు.

ఆ బడికి ఇద్దరే టీచర్లు

ఎనిమిది తరగతులు... 98మంది విద్యార్థులు

- ఉపాధ్యాయుల కొరతతో ముందుకు సాగని చదువు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

హత్నూర(సంగారెడ్డి): విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ బడులకు మహర్దశ పడుతుందని ఎన్నికల ముందు హామీలు ఇచ్చినప్పటికీ అవేవి నెరవేరడం లేదు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపణలు వస్తున్నాయి.

ఇద్దరే మిగిలారు..

హత్నూర మండలం నాగుదేలు పల్లి (యుపిఎస్) ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 98 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ ఇద్దరే ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇంతకుముందు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా.. గత ఏడాది ఓ ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఉన్న నలుగురిలో ఇద్దరు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఐదవ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రతీ సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సిన నిబంధన ఉంది. దీంతో ఈ పాఠశాలకు 11 మంది ఉపాధ్యాయులు నియమించాలి. కానీ ఈ పాఠశాలలో 8 తరగతుల్లో చదువుతున్న 98 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత వేధిస్తూనే ఉంది. విద్యాశాఖ సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ ఆధీనంలోనే ఉన్నప్పటికీ సర్కార్ బడుల అభివృద్ధి అడుగు ముందుకు పడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హత్నూర మండలం నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

హత్నూర మండలం నాగుల్దేవులపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 98 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ సబ్జెక్టుల వారీగా 11 మంది ఉపాధ్యాయులు అవసరం. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

– వెంకట్ నరసింహగౌడ్, ఇన్‌చార్జి ఎంఈఓ

పథకాలు అందేలా చూస్తా

ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. మండలంలోని తిమ్మాపూర్‌లో రూ.9లక్షలతో నిర్మించిన గౌడసంఘం భవనం, అలాగే రూ.10లక్షలతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు బీటీ రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్లను నడపవద్దని, రోడ్డును కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ మోసం

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు. గత ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలను తామే చేపట్టినట్లు చెప్పుకోడం సిగ్గుచేటని, రాహుల్‌గాంధీ హామీ ఇచ్చినట్టు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ రాజు, జెడ్పీటీసీ కవిత, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీటీసీ స్వప్న, మాజీ సర్పంచ్ పద్మ, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, మోహన్, సత్యనారాయణ, పీఆర్‌డిప్యూటీ ఈఈ అమరేశ్వర్, ఐబీ డిప్యూటీ ఈఈ జగన్నాథం పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

కార్యకర్తల సంక్షేమమే ముఖ్యం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: దేశంలోని ఎక్కడాలేని విధంగా కార్యకర్తలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో ఇటీవల నీటమునిగి మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉబ్బని అశోక్ కుటుంబీకులకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని గట్టిగా విశ్వసించిన కేసీఆర్ వారి సంక్షేమానికి పెద్దపీట వేశారని కొనియాడారు. అంతేకాకుండా కొట్లాడి సాధించిన తెలంగాణను దేశంలోనే అగ్రభాగాన నిలపడానికి కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను మరిచి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరును ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మధు, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించండి

సంగారెడ్డి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా వాస్తవ నివేదికలను కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓలు తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వృత్తిపరంగా ప్రత్యేక చట్టం తేవాలి

సిద్దిపేటకమాన్: నాయీ బ్రాహ్మణులకు వృత్తి పరంగా ప్రత్యేక చట్టం తేవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ చౌరస్తా మీదుగా సంఘం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ రక్షణ కోసం తగిన చట్టాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాద్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల రైతువేదికలో మంగళవారం రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా సహకార సంఘం అధికారి ప్రసాద్ పాల్గొని రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 ఎకరాల వరకు రైతు భరోసా పథకం వర్తింపచేయాలని కోరారు. మరికొందరు ఐదు ఎకరాల వరకే పెట్టుబడి సాయం అందించాలని తెలిపారు. అవి కూడా సకాలంలో చెల్లించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు రైతుభరోసా పథకం వర్తింపచేయవద్దని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా వ్యవసాయ పనిముట్లు, గేదెలు, ఆవులు, కోళ్ల పెంపకానికి 75శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు సునీల్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, వ్యవసాయాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించండి

నారాయణఖేడ్: నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బీజేవైఎం నాయకులు ఖేడ్ తహసీల్దారు భాస్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 నిష్పత్తి ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్–2, గ్రూప్–3లో అదనంగా పోస్టులు పెంచాలన్నారు. డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదావేసి 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాల్లో మహిళలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని, పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేసే విధంగా ఉన్న జీవో 46ను రద్దు చేయాలన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు భూమ్‌రాజ్, నాయకులు పట్నం మాణిక్, పండరి, ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

క్లుప్తంగా

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- మూడు గృహాల్లో చోరీ
- బంగారం, వెండి ఆభరణాల తస్కరణ
- క్లూస్ టీం ఆధారాల సేకరణ

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన హత్నూర మండలం పన్యాలలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంటబోయిన వీరమణి భర్త అంజయ్య, చుట్టాకుల గంగమ్మ భర్త మొగులయ్య, తలారి రుక్కమ్మ భర్త మల్లయ్య ఈ కుటుంబాల వారు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. వీటినే టార్గెట్ చేస్తూ వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితులకు చుట్టుపక్కలవారు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన చేరుకొని చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరమ్మ ఇంట్లో తులం బంగారం నగలు, 10 తులాల వెండి నగలు, గంగమ్మ గృహంలో వెండి, బంగారం నగలు, రుక్కమ్మ ఇంటిలో దుస్తులు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సంగారెడ్డి పోలీస్ క్లూస్ టీం వేలిముద్రల నమూనాలను సేకరించినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి


బీరవ్వ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో జరిగింది. మంగళవారం మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు తెలిపిన కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన పర్స బీరవ్వ (90) సోమవారం మధ్యాహ్నం బహిర్భూమికి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయి మృతిచెందింది. ఎంతకీ ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఇరుగు పొరుగు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. చివరికి మంగళవారం చెరువులో ఆమె శవమై కనిపించింది. మృతురాలి కొడుకు ఆశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి కుక్కల వీరవిహారం

- మొగుడంపల్లిలో ఇద్దరికి గాయాలు
- ఇటీవల తీవ్రంగా గాయపడిన ఓ బాలుడు


గాయపడిన నరేశ్ చౌవాన్

జహీరాబాద్ టౌన్: మండలకేంద్రమైన మొగుడంపల్లిలో వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. గ్రామంలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులను చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మంగళవారం మరో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచాయి. పడియల్ తండాకు చెందిన చౌహన్ నరేశ్ మొగుడంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు వస్తున్న క్రమంలో అతడిపై దాడి చేసి గాయపరిచాయి. బాలుడి అరుపులు విన్న స్థానికులు వాటిని తరిమికొట్టి రక్షించారు. స్థానికులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. మరో సంఘటనలో మొగుడంపల్లికే చెందిన వృద్ధుడు నహీంను ఎల్లమ్మ గుడి వద్ద కుక్కలు దాడి చేసి గాయపరిచగా ఆస్పత్రికి తరలించారు. వాటిని పట్టుకొని ఊరి శివారులో విడిచిపెట్టాలని కోరుతున్నారు. కాగా, సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడు అజాన్‌పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం తెలిసిందే.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185231]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిరీక్షణ

పింఛన్ కోసం వితంతువులు, దివ్యాంగుల ఎదురుచూపు

- మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పెండింగ్‌లో 400 దరఖాస్తులు
- కొత్త ప్రభుత్వమైనా స్పందించాలని విజ్ఞప్తి


మండల కార్యాలయం

వితంతువులు, దివ్యాంగులు పింఛన్ కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. మండల కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోయారు. ఇక దివ్యాంగుల విషయంలో సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్నా ప్రభుత్వ వెబ్ సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 6,385 పింఛన్‌లు ఉన్నాయి. ప్రతి నెలా ప్రభుత్వం రూ.2,116లు పింఛన్ అందిస్తోంది. ప్రతి నెలా వివిధ గ్రామాల్లో వివిధ కారణాల వల్ల భర్తలు చనిపోవడంతో భార్యలు వితంతువులతున్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ పోషణ భారం భార్యలపై పడుతోంది. దీంతో పిల్లల చదువుల భారంతో పాటు కుటుంబ పోషణ వితంతువులకు కష్టంగా మారుతోంది. కొంతమంది చిన్న వయసులోనే భర్తను కోల్పోయి ఒంటరి జీవితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వితంతవులకు పింఛన్ రాక అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరు నాలుగైదు ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. పలుసార్లు మండల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయిందని అంటున్నారు. కొంత ఆర్థికంగా ఉన్న వారి పరిస్థితి బాగున్నా, పేద వితంతువుల పరిస్థితి దారుణంగా మారింది.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఇవే

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల అర్హులైన పింఛన్‌దారులు ఇప్పటివరకు మండల కార్యాలయంలో 400 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నేటికి ఏ ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు కాలేదు. ప్రతి నెలా దివ్యాంగులు సదరం క్యాంపులకు వెళ్లి అర్హత సర్టిఫికెట్ తెచ్చుకున్నా సంబంధిత పింఛన్ సైట్ ఓపెన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే ఆ స్థానంలో కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి అందిస్తున్నారు. కొత్త పింఛన్ అందించడం లేదు.

పింఛన్ అందించాలి



నా భర్త అనారోగ్యం బారిన పడి రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ముగ్గురు పిల్లల కుటుంబ పోషణ భారంగా మారింది. పింఛన్ వస్తే కొంత ఆసరాగా ఉంటుందని భావిస్తే రెండేళ్ల నుంచి రావడం లేదు.

– క్యాసారం లక్ష్మి, అనంతసాగర్

దరఖాస్తులు తీసుకుంటున్నాం

కొత్త పింఛన్‌ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మండలంలోని వివిధ గ్రామాల వారు దరఖాస్తులు ఇస్తే తీసుకుంటున్నాం. ప్రభుత్వం పింఛన్ లాగిన్‌ను ఓపెన్ చేస్తే నమోదు చేస్తాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాను.

– యాదగిరి, ఎంపీడీఓ, జగదేవ్‌పూర్

ఈఎంఐకి డబ్బులివ్వలేదని...

- యువకుడి ఆత్మహత్య
- నెల గడువకముందే అన్నదమ్ముల బలవన్మరణాలు
- ర్యాలమడుగులో ఘటన


దినేశ్(ఫైల్)

హవేళీఘణాపూర్(మెదక్): బైక్ ఈఎంఐ కట్టేందుకు డబ్బులివ్వలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ర్యాలమడుగులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాచపల్లి శివ్వమ్మ, మల్లేశంల పెద్ద కుమారుడు దినేశ్(18) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 8న బైక్ ఈఎంఐ కట్టేందుకు తల్లిదండ్రులను అడగగా డబ్బులు లేవని చెప్పారు. మనస్తాపం చెందిన అతడు పొలం వద్ద పురుగుల మందు తాగి ఇంటికొచ్చి సొమ్మసిల్లి పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

కడుపుకోత మిగిల్చి..

తమ్ముడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విషయం తట్టుకోలేని చిన్న కుమారుడు రాజ్‌పల్లి రమేశ్(20) గత నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అతను మరణించిన నెల రోజులు గడువకముందే దినేశ్ మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మెదక్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు


మాట్లాడుతున్న ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు

కొండాపూర్(సంగారెడ్డి): వ్యవసాయాధికారులకు, రైతులకు అనుసంధాన కర్తగా ఉంటూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆత్మ కమిటీ చైర్మన్‌గా తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల, నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సలహాలు, సూచనలిస్తూ రైతుల అభివృద్ధికి పాటుపడతానన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఆత్మ కమిటీ భవనం శిథిలావస్థలో ఉందన్నారు. దాని నిర్మాణానికి రూ.2 కోట్లు, మండల కేంద్రాలలో భవన నిర్మాణానికి రూ. 50 లక్షల ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు త్వరలో రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు సాగుకు పెట్టుబడి సహాయం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నను హతమార్చిన తమ్ముడు

ఇంటి రిజిస్ట్రేషన్ గొడవే కారణం


బాబు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆస్తి తగదా విషయంలో అన్నను తమ్ముడు, అతడి కుటుంబీకులు కలిసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని మల్గిలో చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రప్పకు జగనాథ్, బాబు(46), వైజ్యనాథ్, కంత్యప్ప అనే నాలుగు కుమారులు ఉన్నారు. వారు పెద్దలు సంపాదించిన ఆస్తిని సమానంగా పంచుకున్నారు. అమ్మ పేరిట ఇల్లుండగా తన వాటా పోను సోదరులకు రూ.10 లక్షలిచ్చి కొనుక్కున్నాడు బాబు. తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ఎన్నిసార్లు అడిగినా ముందుకు రావడం లేదు. ఈ విషయమై ఇటీవల పొలం వద్ద అన్నదమ్ములు, కుటుంబసభ్యులు గొడవపడ్డారు. మంగళవారం ఉదయం గ్రామంలోని ఓ హోటల్ వద్ద బాబు టీ తాగుతున్నాడు. తమ్ముడు వైజ్యనాథ్, అతడి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అతడిపై కర్ర, మరణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు


గాయపడిన మూడావత్ నవీన్, తీగుల పవన్

అక్కన్నపేట(హుస్నాబాద్): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గొల్లపల్లి గ్రామ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి గ్రామం మీదుగా హుస్నాబాద్ వైపునకు తీగుల పవన్, రాజయ్య బైక్‌పై వస్తున్నారు. అలాగే హుస్నాబాద్ నుంచి గొల్లపల్లి మీదుగా వేలేరు వైపునకు మూడావత్ నవీన్ వెళ్తున్నాడు. గొల్లపల్లి గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసు నమోదు

- భక్తులపై దాడి ఘటనలో ఏడుగురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన చేర్యాల సీఐ శ్రీను

కొమురవెల్లి(సిద్దిపేట): గత శనివారం రాత్రి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తుల పై దాడి చేసిన ఏడుగురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కొమురవెల్లి ఎస్‌ఐ రాజుగౌడ్‌తో కలిసి చేర్యాల సీఐ శ్రీను నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన 9 మంది యువకులు శనివారం రాత్రి 11 గంటలకు కొమురవెల్లి మల్లన్న దర్శనానికి రాత్రి వచ్చి బస చేసేందుకు గదులను వెతుకుతున్నారు. ఇదే సమయంలో టీమిండియా టీ20 ప్రపంచ కప్పు గెలవడంతో సంబురాలు చేసుకుంటుండగా ఇదే సమయంలో వారు ప్రైవేటు వాహనంలో అటుగా వెళ్తున్నారు. తమను చూసే ఎగతాళి చేస్తున్నారని వాహనం దిగి వేడుకలు చేసుకుంటున్న యువకులపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ విషయమై బాధితుల పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారించి బాధ్యులైన సార్ల నవీన్, శీర్ల శ్రీకాంత్, దేశెట్టి వినయ్, పేర్ల శివమణి, దేశెట్టి నవీన్, పండుగ పవన్, రంగురాజులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ కొమురవెల్లి ఆధ్యాత్మిక కేంద్రమని, స్వామి వారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజ రవుతారన్నారు. పోలీసు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించమన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

ఆకతాయిల ఆగడాలకు ముకుతాడు


సైలెన్సర్లను రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

- సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించిన పోలీసులు
- ప్రజలు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి: ఆకతాయిల ఆగడాలకు పోలీసుల చెక్ పెట్టారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రూ. 3 లక్షల విలువైన సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించారు. అనంతరం ఎస్పీ రూపేశ్ మాట్లాడారు. ద్విచక వాహనదారులు సైలెన్సర్లు మార్చి సౌండ్ పొల్యూషన్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారం రోజులుపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 72 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని తొలగించామన్నారు. కాగా, వాహనదారుల లైసెన్సు రద్దు చేసి, అట్టి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. వాటిని బిగిస్తున్న మెకానిక్‌లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణానికి సంగారెడ్డి పోలీసు శాఖ వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే ట్రాఫిక్ సిగ్నల్స్, యు–టర్న్, ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి డ్రంకెన్ డ్రైవ్ సైతం నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చేస్తున్న వివిధ రకాల కార్యక్రమాల్లో భాగ స్వామ్యం వహించాలన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న పోలీస్ వారికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సంగారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్‌ఐ క్రాంతి కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

- ఇద్దరి నుంచి రూ.5.65 లక్షల వసూలు
- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి


ఏసీపీ మధుతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ మధు, పక్కన సీఐ లక్ష్మీబాబు

సిద్దిపేటకమాన్: ఉద్యోగాల పేరిట ఇద్దరిని మోసగించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబుతో కలిసి అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన జోరవంతల సత్యనారాయణ (50) ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ గృహంలో అద్దెకు ఉంటున్నాడు. పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్నట్లు ఫేక్ ఐడీ కార్డులు సృష్టించాడు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో, విద్యుత్ శాఖ, జెన్‌కోలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించాడు. అతని మాయమాటలు నిజమేనని నమ్మి పట్టణానికి చెందిన అయిత వరప్రసాద్ 2 నెలల క్రితం మూడు విడతలుగా రూ.4.15 లక్షలను, నిందితుడికి వరుసకు బావ అయిన బక్కోళ్ల అశోక్ రూ.1.50 లక్షలను చెల్లించాడు. ఉద్యోగాల ఎప్పుడొస్తాయని అడగగా సత్యనారాయణ ఎలక్షన్‌లు ఉన్నందున కొంత సమయం పడుతుందని చెప్పాడు. తర్వాత మాట దాటవేస్తుండటంతో బాధితులు గట్టిగా నిలదీస్తే బెదిరింపులకు పాల్పడ్డాడు. మోసపోయామని గ్రహించిన వీరు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐ నరసింహారావుతో కలిసి ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు నుంచి పలు ఐడీ కార్డులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఏసీపీ మధు, సీఐ లక్ష్మీబాబు, ఎస్‌ఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ చంద్రం, కానిస్టేబుల్ భూమలింగం పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): అటవీ భూమిని దున్నుతున్న రెండు డోజర్ ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించారు. మంగళవారం మండలంలోని మహ్మద్‌నగర్‌గేట్ తండా సమీపంలో కంపార్ట్‌మెంట్ 303లోని అటవీ భూమిలో తండాకు చెందిన పలువురు రైతులు రెండు డోజర్ ట్రాక్టర్లతో దున్నుతున్నారనే సమాచారం ఫారెస్ట్ అధికారులకు అందింది. ఘటన స్థలానికి చేరుకున్న బీట్ అధికారి ఖైరున్నీసా, సత్యనారాయణ వారిని అడ్డుకొని ట్రాక్టర్లను తరలిస్తుండగా యజమానులు, రైతులు ఆపే ప్రయత్నం చేశారు. అటవీభూములు అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్‌ఆర్‌ఓ అంబర్‌సింగ్ ఆదేశాల మేరకు వాహనాలను రేంజ్ కార్యాలయానికి తరలించారు. బీట్ అధికారులు నవీన్, కుమార్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

చెక్ 'డ్యామేజ్'!


ఖాత వద్ద నెర్రెలు ఇచ్చిన కరకట్ట

- వర్షాలతో ముంచుకొస్తున్న ముప్పు
- బండరాళ్లు దొర్లి టోవాల్ ధ్వంసం
- నెర్రెలు ఇచ్చిన కరకట్ట

నంగునూరు(సిద్దిపేట): రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన చెక్ డ్యామ్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్ల కిందట నిర్మిస్తే నాణ్యతా లోపంతో ధ్వంసమైంది. దీంతో ముప్పు పొంచి ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంగునూరు మండలంగుండా పారే మోయతమ్మెద వాగు నుంచి వృథాగా పోయే నీటిని సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ఏడు చెక్‌డ్యాములు నిర్మించారు. వరద తాకిడి పెరగడంతో యేటా చెక్‌డ్యామ్‌లు నిండి నీరు వృథాగా పోతోంది. నీటికి అడ్డుకట్ట వేసి చుట్టుపక్కల గ్రామాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖాత గ్రామ శివారులో మరో రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో 2020 మేలో రూ 4.60 కోట్లతో సందింటి వెంకట్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద ఒకటి, దారం తిరుపతిరెడ్డి బావి వద్ద రూ 4.75 కోట్లతో మరో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాలుగేళ్ల కిందట ప్రారంభించిన పనుల నేటి వరకు పూర్తి కాలేదు. పనుల్లో నాణ్యతా లోపం వల్ల వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

మరమ్మతులు

సందిటి వెంకట్‌రెడ్డి వ్యవసాయ భూమి వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ సంవత్సరం కిందట వచ్చిన వరదలతో రెండుగా చీలి కొట్టుకుపోవడంతో నీరంతా వృథాగా అవుతోంది. నిర్మాణం పూర్తి కాగానే గైడ్‌వాల్స్‌కు ఇరువైపుల ఫ్లడ్‌బ్యాంక్ నిర్మాణం, కట్టకు తెట్టె పనులు చేపట్టకపోవడంతో ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. దిద్దుబాటు చర్యలో భాగంగా 3 నెలల కిందట మరమ్మతులు ప్రారంభించగా ప్రస్తుతం పనులు పూర్తయి పటిష్టంగా మారింది.

ప్రశ్నార్థకంగా మరో చెక్‌డ్యామ్

దారం తిరుపతిరెడ్డి బావి వద్ద నిర్మించిన మరో చెక్‌డ్యామ్‌కు ఇరువైపుల కరకట్ట నిర్మాణం చేపట్టినా రోలింగ్ సరిగా చేయకపోవడంతో నెర్రెలు వారింది. అలాగే కట్టకు రెండు వైపుల రాతి తెట్టె నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఫ్లడ్‌బ్యాంక్ నుంచి అప్రాన్, కుషన్ వాల్, టోవాల్ నిర్మించి బండరాళ్లతో ప్యాకింగ్ చేశారు. నాణ్యతా లోపంతో పలు చోట్లు పగుళ్లు ఏర్పడగా బండ రాళ్ల నిర్మాణం సరిగా చేపట్టక రాళ్లు దొర్లి టోవాల్ ధ్వంసమైంది. దీంతో నీరంతా వృథాగా మారడంతో పాటు చెక్‌డ్యామ్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.


నాణ్యతా లోపంతో టోవాల్‌కు పగుళ్లు

నోటీస్ అందజేస్తాం

ఖాత వద్ద నిర్మించిన చెక్ డ్యామ్‌ను పరిశీలించగా టోవాల్ డ్యామేజ్ అయినట్లు గుర్తించాం. రాతి తెట్టె నిర్మాణంతోపాటు డ్యామేజ్ అయిన టోవాల్ పూర్తి చేయాలని సంబంధిత ఏజెన్సీకి నోటీసు అందజేశాం. పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్